ప్రజాశక్తి

బుధవారం 11 డిసెంబరు 2024 5

శ్రీకాకుళం




నేటి నుంచి ఎస్ఎ పరీక్షలు

టెక్కలి : విద్యాశాఖ పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో బుధవారం నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ మొదటి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలు రోజుకు రెండు పూటలా నిర్వహించనున్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఉదయం పూట మాత్రమే పరీక్షలు నిర్వహించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో పదో తరగతికి ఆరు పరీక్షలు మాత్రమే నిర్వహించారు. సైన్స్ పరీక్ష నిర్వహణకు ఒక్కరోజు మాత్రమే కేటాయించగా, ఈసారి మాత్రం ఏడు పరీక్షలు చొప్పున సమయాన్ని కేటాయించారు. సైన్స్ పరీక్షని మాత్రం రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు మాత్రం జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి సంబంధిత పాఠశాలల సముదాయాల కేంద్రాలకు పంపిణీ చేస్తారు. అక్కడ్నుంచి నేరుగా పాఠశాలలకు ప్రశ్నపత్రాలు చేరనున్నాయి.

- యూనిట్లు తగ్గినా పెరిగిన బిల్లులు
- వినియోగించిన విద్యుత్ కంటే ఇతర ఛార్జీలే అధికం
- రెండు రకాల ఇంధన సర్దుబాటు ఛార్జీలు
- సర్‌ఛార్జీలు, ఫిక్స్‌డ్, కస్టమర్ చార్జీలతో బిల్లులు తడిసిమోపెడు

వాడకం తక్కువ వాత ఎక్కువ

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజీ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిపిసిఎ) పేరుతో విధించిన ఛార్జీలు ప్రజలకు భారంగా మారాయి. వైసిపి ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ట్రూ అప్, ఎఫ్‌పిపిపిపిసిఎ వంటి రూపాల్లో విధించిన బిల్లుల భారం ఇప్పటికీ కొనసాగుతోంది. తాజాగా టిడిపి ప్రభుత్వం నవంబరు నుంచే ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీలను వసూలు చేయాలని నిర్ణయించడంతో, ఆ భారానికి ఎఫ్‌పిపిపిసిఎ ఛార్జీలు తోడై వినియోగదారులపై మరింత భారం పడింది. వీటికితోడు సర్‌ఛార్జీలు, ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో విధించిన ఛార్జీలతో వస్తున్న బిల్లులు చూసి వినియోగదారుల గుండె గుభేల్‌మంటోంది.





1 : కిలంత్రికి చెందిన గోవిందరావుకు నవంబరులో 83 యూనిట్లకు వచ్చిన బిల్లు రూ.327.61

2 : డిసెంబరులో 67 యూనిట్లకు వచ్చిన బిల్లు రూ.616.50

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ మండలం కిలంతరిలో 133219పి226000096 సర్వీసు నంబరు వినియోగదారుడు ఆర్.గోవిందరావు నవంబరు బిల్లులో 83 యూనిట్ల కరెంట్‌ను వినియోగించారు. ఆ నెలలో అతనికి రూ.327.61 బిల్లు వచ్చింది. డిసెంబరు బిల్లులో 67 యూనిట్ల విద్యుత్ వినియోగించగా, ఆశ్చర్యకరంగా బిల్లు అమౌంట్ దాదాపు రెట్టింపు అయింది. ప్రభుత్వం తాజాగా విధించిన ఎఫ్‌పిపిపిసిఎ ఇతర ఛార్జీలు కలుపుకుని రూ.616.50 వచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం అమలు చేసిన ఎఫ్‌పిపిపిసిఎ-1 ఛార్జీ రూ.22.33, గత వైసిపి ప్రభుత్వం విధించిన ఎఫ్‌పిపిపిసిఎ-2 రూ.30 ఇవి కాక కస్టమర్ ఛార్జీలు రూ.30, సర్‌ఛార్జీ రూ.25, ఫిక్స్‌డ్ ఛారీ రూ.10 ఇలా అన్నిరకాల ఛార్జీలను కలిపి రూ.616.50గా లెక్క గట్టి బిల్లు జారీ చేశారు. ఆటో నడుపుతూ బతుకుతున్న తనకు ఇంతేసి బిల్లులు వస్తే ఎలా కట్టగలనని వాపోతున్నాడు. ఇంటిలో టివి, రెండు బల్బులు, ఒక ఫ్యాన్ మాత్రమే వాడతానని, బిల్లు మాత్రం గత నెల కంటే రెట్టింపు వచ్చిందని వాపోతున్నాడు.

యూనిట్లు తగ్గినా... పెరిగిన బిల్లు

శ్రీకాకుళం నగరం పిఎన్ కాలనీలో 131102ఐ601045268 సర్వీసు నంబరు వినియోగదారుడు ఎం.సత్యనారాయణరెడ్డి నవంబరు బిల్లులో 65 యూనిట్లు వినియోగించారు. అందుకు గానూ రూ.235.68 బిల్లు వచ్చింది. డిసెంబరులో వచ్చిన బిల్లులో 52 యూనిట్లు కరెంటే వాడారు. సాధారణంగా అంతకంటే తక్కువ బిల్లే రావాలి. కానీ రూ.90 అదనంగా వచ్చింది. ప్రభుత్వం తాజాగా ఎఫ్‌పిపిపిసిఎ-1 రూపంలో డబ్బులు వసూలు చేయడంతో బిల్లు రూ.324.83 వచ్చింది. వీటితో పాటు ఇతర అన్నిరకాల ఛార్జీలు కలపడంతో డిసెంబరులో అధిక మొత్తంలో బిల్లు వచ్చింది. గత వైసిపి ప్రభుత్వం విధించిన ఎఫ్‌పిపిపిసిఎ-2 ఛార్జీ రూ.30, కస్టమర్ ఛార్జీలు రూ.30, ఫిక్స్‌డ్ చార్జీ రూ.10, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.3.90 ఇలా అన్ని రకాల ఛార్జీలను కలిపి రూ.324.83గా లెక్క గట్టి బిల్లు జారీ చేశారు.



పోస్టుకార్డులను పంపిస్తున్న బిసి సంఘ నాయకులు, విద్యార్థులు

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయొద్దు

ప్రజాశక్తి - సోంపేట

ఆంధ్రుల ఆత్మ బలిదానాలతో సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని బిసి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై లక్ష పోస్టుకార్డుల ఉద్యమంలో భాగంగా బిసి నాయకులు గేదెల దేవరాజ్, పల్లి హరిశ్చంద్ర, ఇరోతు శ్రీనివాస్, నాయని యాదవరావు, గేదెల సుజాత తదితరులతో కలిసి సోంపేట పోస్టాఫీసు వద్ద వెయ్యి పోస్టు కార్డులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ద్వారా లక్ష మంది ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ వల్లే ఉత్తరాంధ్రలో వలసలు తగ్గాయన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను మోడీ సర్కారు ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని, అదానీ పోర్టుకు ఉపయోగపడేలా స్టీల్‌ప్లాంట్‌ను మార్చేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పోస్టుకార్డులను పంపిస్తున్నట్లు తెలిపారు.

నేడు, రేపు పోస్టల్ బీమా మెగా మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 11, 12 తేదీల్లో పోస్టల్ జీవిత బీమా (పిఎల్ఐ) గ్రామీణ పోస్టల్ జీవిత బీమా (ఆర్‌పిఎల్ఐ) మెగా మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వండాన హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రూ.రెండు కోట్ల ప్రీమియం సమీకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దేశంలో ప్రతి వంద మందిలో 30 మందికి మాత్రమే జీవిత బీమా పొంది ఉన్నారని, మిగిలిన 70 శాతం ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ లాభాన్ని పొందడానికి వీలుందని తెలిపారు. ప్రతి ఒక్క పౌరునికి జీవిత బీమాను అందించాలన్నదే పోస్టల్ శాఖ లక్ష్యమన్నారు. సేవింగ్ ఖాతా మాదిరిగానే పోస్టాఫీసులు అందించే జీవిత బీమాకు ఎక్కువ బోనస్‌ను పొందుతున్నట్లు వివరించారు. ప్రతిఒక్కరూ ఈ సేవలను సమీప పోస్టాఫీసుల ద్వారా వినియోగించుకుని, పోస్టల్ జీవిత బీమా, గ్రామీణ పోస్టల్ జీవిత బీమాలను పొందవచ్చన్నారు. తద్వారా కుటుంబాలకు భరోసా కల్పించుకోవాలని సూచించారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న సిఐ ఈశ్వరరావు

నగరంలో పలుచోట్ల నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్న ఎచ్చెర్ల మండలం కుప్పిలికి చెందిన వాకాడ సూర్యనారాయణ, వాకాడ గణేష్‌ను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సిఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సంతోష్ తెలిపారు. శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టి కేసు వివరాలను వెల్లడించారు. నగరంలోని మెడికవర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో చోరీకి గురైన నాలుగు బైక్‌లను గుర్తించినట్లు తెలిపారు. నిందితులు పల్సర్ బైక్‌పై ప్రయాణిస్తూ పట్టుబడ్డారని, వారిని విచారించగా వారు నడుపుతున్న వాహనం విశాఖ నగరంలో దొంగిలించినట్లు అంగీకరించారని వివరించారు. ఆ బైక్‌తో పాటు నగరంలోని మరో రెండు బైక్‌లతో పాటు రణస్థలంలో చోరీకి గురైన మరో బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు గతంలోనూ పలు చోరీలకు పాల్పడిన పాత నేరస్తులుగా గుర్తించామన్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఇచ్చిన సూపర్ సిక్స్‌ల హామీల అమల్లో టిడిపి కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఎంపిపి కిల్లి సత్యనారాయణ అభినందన సభను నగరంలోని ఒక హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలను అమలు చేయకుండా, డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ప్రతి కార్యకర్త నిరంతరం ప్రజల్లో ఉండి పనిచేయాలని, అప్పుడే వైసిపికి పూర్వ వైభవాన్ని తీసుకురాగలమన్నారు. ప్రభుత్వ విధానాలపై ప్రజల్లోకి వెళ్లి పోరాడతామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 13వ తేదీన రైతుల సమస్యలపై కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నామన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ రాజ్యసభ సీట్లను కూటమి ప్రభుత్వం అమ్ముకుందని ఆరోపించారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు ఓట్లేశారని, గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఇప్పటికే పక్కన పెట్టేశారని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, జిల్లాలో కింజరాపు కుటుంబాలకు పదవులు వచ్చాయి తప్ప ప్రజలకు మాత్రం అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వానికి ఎదురెళ్లి నిలబడాల్సిన సమయం వచ్చిందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయశాఖ మంత్రి ఉన్నా రైతులకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్, కళింగ, తూర్పుకాపు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దుంపల లక్ష్మణరావు, మామిడి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణను సత్కరిస్తున్న కృష్ణదాస్ తదితరులు



రైల్వే మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రామ్మోహన్ నాయుడు, గౌతు శిరీష

ఒబిసి ప్రక్రియను వేగవంతం చేయాలి

కేంద్ర సామాజిక, న్యాయశాఖ మంత్రిని కోరిన రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఉత్తరాంధ్రలోని తూర్పుకాపు, కళింగవైశ్య, శిష్టకరణ, సొండి, అరవ కులాలను ఒబిసి జాబితాలో చేర్చాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. దీనిపై పదేళ్లుగా పార్లమెంట్‌లో, ఎన్‌సిబిసి కమిషన్‌లో పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈమేరకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి కేంద్ర సామాజిక, న్యాయ శాఖ మంత్రి వీరేంద్ర కుమార్‌ను ఢిల్లీలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీన్ని ప్రాధాన్యతగా గుర్తించడంతో పాటు త్వరితగతిన రిజిస్ట్రేషన్ అమలయ్యేలా చూడాలని విన్నవించారు.

పూండీ రైల్వేస్టేషన్, బెండి గేటు అంశంపై..

పూండీ రైల్వేస్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశారు. కరోనా ముందు పూండీలో భువనేశ్వర్ - సికింద్రాబాద్ (విశాఖ ఎక్స్‌ప్రెస్), భువనేశ్వర్ - బెంగళూరు (ప్రశాంతి ఎక్స్‌ప్రెస్), పూరీ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేసే వారని గుర్తుచేశారు. ఆయా రైళ్ల నిలుపుదలను పున: ప్రారంభించాలని కోరారు. పూండీ రైల్వేస్టేషన్‌లో తాగునీరు, ప్రయాణికుల విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు, రిజల్యూషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. దీంతోపాటు నత్తనడకన సాగుతున్న బెండి గేటు ఫ్లై ఓవర్ పనులను వేగవంతం చేసి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని వివరించారు. కాశీబుగ్గ ఎల్‌సి గేటు వద్ద నిలిచిపోయిన రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి, ఆర్‌ఒబి నిర్మాణానికి హామీనిచ్చారు. వారితో పాటు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ తదితరులు పాల్గొన్నారు.



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అట్టాడ అప్పలనాయుడు తదితరులు

'ఖాకీ చొక్కా' శ్రమకు నిదర్శనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఖాకీ చొక్కా కవితా సంపుటి శ్రమ, నిబద్ధత, త్యాగశీలతకు నిదర్శమని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్ రచించిన ఖాకీ చొక్కా కవితా సంపుటిని మంగళవారం ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. సాధన, శోధన కవి ప్రధాన లక్షణాలని, అవి పుష్కలంగా ఉన్న ఉదయ్ కిరణ్ మంచి కవిగా ఎదుగుతారని చెప్పారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలపై స్పందించడమే కవిత్వమన్నారు. ఆ స్పందనలకు అక్షర రూపం ఇచ్చి ఒక కవితా సంపుటిని వెలువరించడం సంతోషకరమని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార రాజు మాట్లాడుతూ కవితా సంపుటిలో గ్రంథాలయం ప్రాశస్త్యాన్ని వివరిస్తూ కవిత రాశారని, అది తన మనసుకి ఎంతగానో హత్తుకుందని తెలిపారు. ప్రముఖ రచయిత కంచనాన భుజంగరావు పుస్తకాన్ని సమీక్షిస్తూ కవితా సంపుటిలో 37 కవితలు ఉన్నాయని... కుటుంబ బాంధవ్యాలను, మానవీయతను అద్భుతంగా, ఆర్ద్రంగా వర్ణించారని తెలిపారు. గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి, కవయిత్రి తంగి ఎర్రమ్మ ఆత్మీయ సందేశాలు ఇస్తూ మాట్లాడారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పిలి వెంకట రాజారావు, రౌతు ధనలక్ష్మి తదితరులు స్వీయ కవితా పఠనం చేశారు. రచయిత బాడాన శ్యామలరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నెట్టిమి రమణ, డి.రామకృష్ణ, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు, అంబేద్కర్ యూనివర్సిటీ అధ్యాపకులు లీలాప్రసాద్, గాయకులు చింతాడ రామచంద్రరావు, శ్రీనివాసులు, ఎం.ప్రభాకరావు, పి.సుధాకర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - నరసన్నపేట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని మడపాంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలతో ప్రజలు బాధపడుతున్నట్టు గుర్తించిన ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. సమస్య పరిష్కారమైందా, లేదా అన్నది ఫోన్‌కి మెసేజ్ వస్తుందన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులంతా రెవెన్యూ సదస్సులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రజలు నేరుగా వచ్చి తమ వినతిపత్రాల ద్వారా రికార్డుల్లో పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపిడిఒ, మండల ప్రత్యేకాధికారి, టిడిపి మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అడపా చంద్రశేఖర్, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

జిల్లాకు 'గరిమెళ్ల' పేరు పెట్టాలి

ప్రజాశక్తి- పోలాకి

స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాకవి గరిమెళ్ల సత్యనారాయణ పేరు శ్రీకాకుళం జిల్లాకు పెట్టాలని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు నల్లి ధర్మారావు కోరారు. మండలంలోని ప్రియాగ్రహారంలో గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన, ప్రగతి సాహితీ సమాఖ్య ఆధ్వర్యాన 'గరిమెళ్ల సాహితీ స్రవంతి' అను పుస్తకావిష్కరణ, 'మాకొద్దీ తెల్లదొరతనం'నాటిక పరిచయ సభ మంగళవారం నిర్వహించారు. గరిమెళ్ల మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి బరాటం రాజు స్వాగతోపన్యాసంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రగతి సాహితీ సమాఖ్య అధ్యక్షులు బి.గణపతిరావు అధ్యక్షత వహించారు. అరసం, విజయనగరం జిల్లా అధ్యక్షులు రత్నాల బాలకృష్ణ సంపాదకత్వంలో ప్రచురించిన 'గరిమెళ్ల కవిత స్రవంతి'ని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.నాగకుమారి ఆవిష్కరించారు. సాహితీవేత్త ధర్మారావు రచించిన 'మా కొద్దీ తెల్లదొరతనం' నాటికను స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వేశ్వరరావు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ గరిమెళ్ల రచనలు నేటికీ సమాజంలో చైతన్యం నింపే అస్త్రాలని అన్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ గరిమెళ్ల పాట నాటి తెల్లదొర గుండెల్లో పేలిన తూటా అని అన్నారు. గిడుగు రామ్మూర్తి జనవిద ఫౌండేషన్ అధ్యక్షులు బద్రి కూర్మారావు మాట్లాడుతూ గరిమెళ్ల పుట్టిన ప్రియాగ్రహారంలో పుట్టిన ప్రతిఒక్కరూ ధన్యజీవులని అన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ నేటికీ కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా ఉద్యమాలకు గరిమెళ్ల స్ఫూర్తి అని అన్నారు. కార్యక్రమంలో గరిమెళ్ల ట్రస్టు అధ్యక్షులు ఎస్.ఈశ్వరరావు, చింతాడ కృష్ణారావు, దుబ్బ కోటేశ్వరరావు, డాక్టర్ జి.జయపాల్‌రావు, ఇప్టా జిల్లా అధ్యక్షులు ఎం.వి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


రాష్ట్రపతితో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

రాష్ట్రపతిని కలిసిన ఎంపీ

ప్రజాశక్తి- లావేరు

వచ్చేదాని మహిళా దినోత్సవం సందర్భంగా విజయనగరంలో ఏర్పాటు చేయనున్న మహిళా సమావేశానికి రావాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కుటుంబ సభ్యులతో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి తండ్రి పివిజి రాజు జీవిత చరిత్ర, మహారాజా ఆఫ్ విజయనగరం పుస్తకాన్ని అందించారు. అలాగే ఆంధ్రా చేనేత కార్మికులు నేసిన చీరను అందజేశారు. విజయనగరం పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీల మహిళలతో అద్భుతమైన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి


శ్రీకాకుళం రూరల్: వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కిష్టప్పపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఆక్రమణలు, ఫ్రీహోల్డ్, మ్యుటేషన్, 22ఎ, డికెటి, రీసర్వే వంటి సమస్యల పరిష్కరించాలని కోరుతూ రైతులు వినతిపత్రాలను అందజేశారు.

లావేరు: మండలంలోని తామదలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ మేరకు 66 భూ సమస్యలపై వినతిపత్రాలు వచ్చినట్లు డిటి ఎం.తిరుపతిరావు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ బి.శ్రీధర్‌రెడ్డి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పి.మధుబాబు, మాజీ సర్పంచ్ శ్రీనివాస రావు, విఆర్ఒ కిరణ్మయి, కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని జగతిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ మురళీమోహన్ 8 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి ప్రసాదరావు, నాయకులు బెందాళం రమేష్, సీపాన వెంకటరమణ, బెందాళం తిరుమలరావు, రంగా రౌలో, డిటి కృష్ణమూర్తి, ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ మల్లికార్జున పానిగ్రాహి, విఆర్ఒ నారాయణ పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని 20 ఎకరాల మెట్ట భూమి ప్రాంతాన్ని ఆక్రమణదారులు ఏళ్ల తరబడి ఆక్రమించుకున్నారని, దీనిపై పరిశీలన చేసి ఆక్రమణ తొలగించాలని గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ అప్పలస్వామి ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన పాతిన కృష్ణమూర్తి, జుత్తు సింహాచలం, బి.పాపారావు, రామారావు, జేజమ్మ, సూరాడ చంద్రమోహన్ వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ముకుందరావు పాల్గొన్నారు.

పొందూరు: రెవెన్యూ సమస్యలు, భూసమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం పెట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, టిడిపి మండల అధ్యక్షులు సిహెచ్.రామ్మోహన్‌లు కోరారు. స్థానిక నెహ్రూ పార్కు ఆవరణలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పట్టణానికి సంబంధించి 163-1 సర్వే నంబరులో రిజర్వాయర్ నిర్మించాలని, దీనిపై క్రయవిక్రయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని అనకాపల్లి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. సీతమ్మ చెరువు నుంచి దాళికి కోనేరుకు బట్టిద్వారా నీరు అందుతుందని, ఈ చెరువు కింద 40 ఎకరాలు సాగవుతుందని, బట్టిని ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో నీటి ప్రవాహం నిలిచిపోయిందని, దీనిపై తక్షణమే ఆక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఇఒ మోహన్‌బాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.చినరంగా, ఎంపిటిసి ప్రతినిధి బాడాన గిరి, వార్డు సభ్యులు మురళి, బాల పాల్గొన్నారు.


కొత్తూరు : వినతులను స్వీకరిస్తున్న తహశీల్దార్ రవిచంద్ర


సోంపేట: వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కొత్తూరు : మండలంలో ఒంపుజోల పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ రవిచంద్ర వినతులు స్వీకరించారు. గుబివిరంపేట, ఒంపుజోల గ్రామానికి చెందిన రైతుల సర్వే నంబరు 50 నుంచి 120 వరకు 160 ఎకరాల భూమికి మెట్టు బంజరు అడంగల్ 1బిలో వస్తోందని, దీని మూలంగా రైతులు బ్యాంకుల్లో లోన్ తీసుకోవడంలో అనేక ఇబ్బందులు పాలవుతున్నామని అన్నారు. ఆడ పిల్లల పెళ్లి సమయంలో అమ్ముకుందామంటే ఎవరూ ఆసక్తి చూపించడం లేదని వివరించారు. దీనిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ ఛైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ గండవరపు ఈశ్వరి, ఎంపిటిసి మాజీ సభ్యులు నిమ్మగెడ్డ కృష్ణ, బి.సుందర నారాయణ, చింతాడ రామయ్యస్వామి, చింతాడ గోవిందస్వామి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని బెల్లుపడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఎన్.వెంకటరావు రైతుల నుంచి వినతులను స్వీకరించారు.

నందిగాం : మండలంలోని చిన్నతామరపల్లి, కర్లపూడి, నౌగాం, చిన్నలక్ష్మీపురం గ్రామాల్లో తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, డిటి ఆర్.రామారావు ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హనుమంతరావు, సింహాచలం, విఆర్ఒలు సింహాద్రి, కోటమ పాల్గొన్నారు.

టెక్కలి సర్పంచ్ రాజీనామా?

టెక్కలి : టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండెల సుజాత తన సర్పంచ్ పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రచారం సాగుతోంది. పట్టణంలో 8వ వార్డు చౌక ధరల దుకాణం డీలర్‌గా పనిచేస్తూ... వైసిపి ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌గా విజయం సాధించారు. సర్పంచ్‌గా గెలుపొందిన తర్వాత డీలర్ ఉద్యోగానికి సహజంగా రాజీనామా చేయాలి. కానీ, వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అటు సర్పంచ్‌గా, ఇటు డీలర్‌గా కొనసాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి నేపథ్యంలో సర్పంచ్ బంధువులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసిన విషయం తెలిసిందే. అయితే నిబంధనల మేరకు అధికారులు నడుచుకోవాలని మంత్రి సూచించారు. ఈ క్రమంలోనే గతంలో సివిల్ సప్లయి డిటిగా ఉన్న మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఈ సమయంలో డీలర్ల జాబితాలను ఆర్‌డిఒకి అందించారు. టెక్కలి 8 వార్డు డీలర్ గొండేల సుజాత సర్పంచ్ అనే విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తర్వాత బాధ్యతలను స్వీకరించిన సివిల్ సప్లయి డిటి అనిల్‌కుమార్ పాత్రో కూడా తన నివేదికలో సర్పంచ్ సుజాత డీలర్ అనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రికార్డులను పరిశీలించిన ఆర్‌డిఒ కొద్ది రోజుల క్రితం సర్పంచ్ సుజాతకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై ఆమె సోమవారం ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని కలిసి ముఖాముఖిగా మాట్లాడారు. ఒక వ్యక్తి రెండు పదవులు నిర్వహించకూడదని తనకి తెలియదని, సర్పంచ్ పదవిని విడిచిపెడతానని చెప్పినట్లు సమాచారం. అలాగే మంగళవారం కూడా ఆర్‌డిఒను కలిసి రాతపూర్వకంగా తెలియజెప్పేందుకు సర్పంచ్ సుజాత సిద్ధపడినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మరో 13 నెలల్లో సర్పంచ్ పదవీ కాలం ముగియనుండడంతో కొద్ది నెలలు పాటు ఏదో ఒకవిధంగా కాలం గడిపేందుకు సర్పంచ్ వర్గీయులు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారాన్ని చూసీచూడనట్లు ఉండిపోయే విధంగా సర్పంచ్ వర్గీయులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మరలా తాజాగా మంత్రిని కలిసినట్లు తెలిసింది. ఏదేమైనా టెక్కలి సర్పంచ్ పదవికి రాజీనామా చర్చనీయాంశమవుతుంది.

14న సాగునీటి సంఘాల ఎన్నిక

లావేరు: మండలంలోని 13 సాగునీటి సంఘాలకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ ఎన్ని జోగారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఒకో సంఘంలో ఆర్ టిసిలు ఉంటాయని తెలిపారు. ఎన్నికల్లో ఓటరుగా ఒక్కే దగ్గర ఓటు హక్కు వినుయోగించుకోవాలన్నారు. ఎన్నికలు నోటిఫికేషన్ ఈ నెల 11న వెలువడుతుందన్నారు. నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల నిర్వహణ, ఫలితాలు ఒకే రోజు వెలువడతాయన్నారు. 13 సంఘాల్లో 78 టిసిలకు ఎన్నికలు చేపడుతున్నామన్నారు. మండలంలోని 13 సాగునీటి సంఘాల పరిధిలో 5405 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పురుషులు ఓటర్లు 4129 మంది, మహిళలు 1276 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఒక్క దగ్గర మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రం సిబ్బందిని నియమించిందన్నారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నట్లు వెల్లడించారు.



యువకుడు ఆత్మహత్య


దుర్గాప్రసాద్ (ఫైల్)

కోటబొమ్మాళి: పోలాకి మండలం ప్రియాగ్రహారానికి చెందిన చెందిన కొండ దుర్గాప్రసాద్ (24) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుర్గాప్రసాద్ సోమవారం మధ్యాహ్నం మండలం హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో చేరుకున్నాడు. విషయాన్ని గుర్తించిన స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఎఎస్ఐ శంకరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

నందిగాం : మండలం హర్షవాడ పంచాయతీ సాగరంపేట వద్ద అదే గ్రామానికి చెందిన ఎస్.వెంకటరావును 20 లీటర్ల నాటు సారాతో పట్టుపడ్డారని ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. నిందితుడిని టెక్కలి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

మద్యం సీసాలతో వ్యక్తి...

పాతపట్నం: మండలంలోని కాగువాడకు చెందిన వ్యక్తి ఏడు మద్యం సీసాలతో పట్టుబడ్డాని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. మండలంలోని బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- కంచిలి

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు విజిలెన్స్ సిఐ డి.రామారావు, ఆర్ఐ కృష్ణప్రసాద్ రౌలో, సిఎస్ డిటి కూర్మారావులు సోదాలు నిర్వ హించారు. మకరాంపురం జాతీయ రహదారి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, బొలెరో వాహనంలో 60 సంచుల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

బకాయి వేతనాలు చెల్లించాలి


కొత్తూరు : కొత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నవంబరు నెలలో కోత పడిన వేతనాలు అంగన్వాడీ కార్యకర్తల అకౌంట్‌కు జమ చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్, హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి విమలకుమారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కూరగాయల బిల్లులను తక్షణమే చెల్లించాలన్నారు. వినతిపత్రం అంజదేసిన వారిలో యూనియన్ ఎస్.అనురాధ, కె.హేమలత, కె.లక్ష్మి, సిర్ల ప్రసాద్, శ్రీలత, శాంతి, రాధారాణి పాల్గొన్నారు.

ఎఫ్‌పిఒ అధ్యక్షునిగా అనిల్‌కుమార్

ప్రజాశక్తి- కవిటి


అనిల్‌కుమార్

సెర్ఫ్ - వెలుగు ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కొబ్బరి ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఒ) అధ్యక్షునిగా ఆరింగి అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు మండల మహిళా సమాఖ్య భవనంలో ఎఫ్‌పిఒ ప్రస్తుత అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్ ఆధ్వర్యాన మంగళవారం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షునిగా గొండ్యాల రవి, కోశాధికారిగా బొడ్డ శ్రీనివాసరావు, కార్యదర్శిగా దట్టి దాలయ్య, సహకార్యదర్శిగా ఆర్.నారాయణరావు ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరికి ప్రస్తుత కార్యవర్గ సభ్యులు, రైతులు, వెలుగు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న నేతాజీ

బీమాపై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

అనిశ్చిత సమాజంలో జీవిత బీమా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని ఎల్ఐసి నరసన్నపేట సీనియర్ బ్రాంచి మేనేజర్ ఎం.నేతాజీ అన్నారు. జీవితానికి రక్షణ కల్పించడానికి ఎల్ఐసి ప్రజలకు ఎంతో సహాయం చేస్తోందనీ తెలిపారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవితానికి రక్షణ సామాజిక భద్రతే ధ్యేయంగా సంస్థ పనిచేస్తోందని తెలిపారు. ప్రిన్సిపాల్ సురవరపు సత్యనారాయణ సూచనలతో, డివిఇఒ తవిటినాయుడు ఆదేశాల మేరకు అవగాహన కల్పించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి పేర్కొన్నారు.

నేడు వైసిపి కార్యాలయం ప్రారంభం

టెక్కలి రూరల్ : నియోజకవర్గ పరిధిలో వైసిపి నూతన పార్టీ కార్యాలయం ఈ నెల 11న ఉదయం 10 గంటలకు టెక్కలి- తెంబూరు రోడ్డు ఫ్లైఓవర్ వంతెన సమీపంలో ప్రారంభించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొవాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి శ్రీకారం

ప్రభుత్వ విప్ అశోక్


ట్రాక్టర్‌ను నడుపుతున్న విప్ అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పల్లె పండగతో మారుమూల గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మందపల్లి గ్రామ పంచాయతీకి శానిటేషన్‌ను మంజూరైన కొత్త ట్రాక్టర్‌ను మంగళవారం ప్రారంభించి కొంత దూరం డ్రైవింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీ వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పంచాయతీ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, ఎంపిపి బోర పుష్ప, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, తిప్పన దుర్యోధనరెడ్డి, టిడిపి నాయకులు దక్కత ఢిల్లీరావు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని సంచాంకు ఆనుకుని ఉన్న కొండ సర్వే నంబరు 89/6లో రెండు రోజులుగా గ్రావెల్ తవ్వేందుకు ట్రాక్టర్లతో, లారీలతో ప్రొక్లెయినర్‌ను తీసుకొని కొందరు వ్యక్తులు వచ్చారు. గ్రావెల్ తరలించేందుకు రోడ్డును కూడా తయారు చేశారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమయ్యారు. ఆ గ్రావిల్ తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలను అడ్డుకున్నారు. తమకు గ్రావెల్ తరలించేందుకు లీజు ఉందని, గ్రావెల్ తరలిస్తామని వారు అనడంతో వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో సంచాం గ్రామంతో పాటు చుట్టుపక్క గ్రామాలకు చెందిన కొంత మంది చేరుకొని మంగళవారం గ్రావెల్ తరలించే వాహనాలను అడ్డుకుని వాహనాలను వెనక్కి తరలించారు. వాహనాలు గ్రావెల్ తీసుకెళ్లే తోవలను సైహితం ముల్లకంచెలతో కట్టేశారు. ఈ విషయంపై అధికారులు సంప్రదించగా, గ్రావెల్ కోసం లీజు తీసుకున్నారని అన్నారు. అయితే గ్రామస్తులు పూర్తిగా అభ్యంతరం తెలపడంతో ఆ విషయాన్ని మైన్స్, రెవెన్యూ జిల్లా అధికారులకు ప్రజల అభ్యంతరాలను తహశీల్దార్ రాతపూర్వకంగా తెలియజేశారని తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ మాట్లాడుతూ తాత ముత్తాతల నుంచి ఈ కొండను ఆధారంగా ఎంతోమంది జీవిస్తున్నామని అన్నారు. మేకలకు, గొర్రెలకు, పశువులకు ఎంతో జీవనాధారంగా ఈ కొండ ఉందని అన్నారు. రైతాంగానికి అండగా ఉన్న ఈ కొండపై గ్రావెల్ తొలగిస్తే తమ గ్రామంలోని రైతులందరూ ఎటు వెళ్లిపోవాలని ప్రశ్నించారు. అందుకు తక్షణమే ఇక్కడ గ్రావెల్ తవ్వకాలని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పాలకులు, అధికారులు స్పందించి అనుమతులను రద్దు చేయాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

వినియోగదారులకు భరోసా 'ఆశ్రా'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్ఒ సూర్యప్రకాశరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారుల హక్కులు, పరిరక్షణ కోసం ఆశ్రా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.సూర్యప్రకాష్‌రావు అన్నారు. కలెక్టరేట్‌లో ఆశ్రా పోస్టర్‌ను అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ అధ్యక్షులు గంజి ఆర్ ఎజ్రా ఆధ్వర్యాన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ నెల 15న ఆసరా జాతీయ వారోత్సవాలను బెంగళూరులో నిర్వహించినట్లు తెలిపారు. వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల హక్కు అని అర్థమని చెప్పారు. వ్యాపారంలోని అనుచిత పద్ధతుల బారిన పడకుండా వినియోగదారును కాపాడాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గేదెల ఇందిరా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతి, జాయింట్ సెక్రెటరీ అనిల్ రాజ్ పాల్గొన్నారు.

తారు రోడ్డుకు మోక్షం


నిర్మించిన తారు రోడ్డు

ప్రజాశక్తి- పలాస

గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి పాలకుని నిర్లక్ష్యానికి గురైన ఒక్కో అంశాన్ని పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నారు ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీష. కాశీబుగ్గలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేస్తామని రెండు దఫాలు శంకుస్థాపనలు చేశారు. అయినా ఆ సమస్యను పరిష్కరించలేక అప్పటి పాలకుడు చతికిలబడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో విఫలమవడంతో గతుకుల రోడ్లలోనే ప్రయాణికులు ఉసూరుమని రాకపోకలు సాగించేవారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా తాత్కాలికంగా వేసిన రోడ్డు దయనీయస్థితిలో ఉన్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. చిన్న వాహనం వెళ్లినా దుమ్ము ధూళి చెలరేగి వెనుకవస్తున్న వాహనాలకు కనీసం రోడ్డు కూడా కనిపించని స్థితి దాపురించిందంటే అతిశయోక్తి కాదు. అయితే పలాస ఎమ్మెల్యేగా గౌతు శిరీష విజయం సాధించిన తర్వాత ఆ బ్రిడ్జి నిర్మాణానికి అడుగులుపడ్డాయి. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు జిల్లా పర్యటనకు వచ్చిన నేపథ్యంలో స్థానిక సమస్యలను ఆయన దృషికి తీసుకెళ్లి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడి బ్రిడ్జి నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వ సహకారంతో పూర్తి చేసేందుకు ప్రణాళిక చేసినట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం ఉన్న రోడ్డు పాడవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల అక్కడ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఆ రోడ్డు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో ఆ ప్రాంతీయులతో పాటు వాహనచోదకులు ఎమ్మెల్యే శిరీషకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

'హమ్మింగ్‌బర్డ్' విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జాతీయస్థాయి హమ్మింగ్ బర్డ్ ఒలింపియాడ్ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన జ్ఞానభారతి విద్యార్థులకు ట్రస్టు సిఇఒ, కార్యదర్శి జోహార్ ఖాన్ అభినందించారు. ఈ మేరకు మంగళవారం పతకాలను, ధ్రువపత్రాలను అందజేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి హమ్మింగ్ బర్డ్ ఒలంపియాడ్ మాథ్స్, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు పరీక్షలను నిర్వహించిందన్నారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 91 మంది విద్యార్థులకు హమ్మింగ్ బర్డ్ ఒలంపియాడ్ నిర్వాహకులు బంగారు, వెండి, రజిత పతకాలను, ధ్రువపత్రాలను పాఠశాలకు అందించారు. జ్ఞాన భారతి పాఠశాల విద్యార్థులు అత్యద్భుతమైన విజయాలను సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో విభిన్నమైన ప్రతిభలను వెలికితీసే అవకాశాలను జ్ఞానభారతి ఎప్పుడూ వినియోగించుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెడ్‌మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, పిఇటి కైలాస్ కుమార్ పండా పాల్గొన్నారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న జోహార్‌ఖాన్

నకిలీ పెన్షన్‌పై రాద్ధాంతమా?


సైకిల్ తొక్కుతున్న వికలాంగ పింఛనుదారుడు ఆనందరావు

ఆమదాలవలస : మండలంలోని కనుగులవలసకు చెందిన సీపాన ఆనందరావు నకిలీ వికలాంగ పింఛనుపై వైసిపి నాయకులు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని మండల టిడిపి అధ్యక్షులు నూక అప్పలసూరనాయుడు (రాజు) అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న సామాజిక పింఛన్ల తనిఖీలో బోగస్ దారుల బండారాలు బయటపడనున్నాయని అన్నారు. కనుగులవలసకు చెందిన సీపాన ఆనందరావు అన్ని అవయాలు సక్రమంగా ఉన్నా.. వైసిపి ప్రభుత్వంలో నకిలీ వికలాంగ ధ్రువపత్రంతో పింఛను తీసుకుంటున్నారని రుజువు చేశారు. ఈ నకిలీ పింఛనుపై ఇటీవల మీకోసం ఫిర్యాదు చేశామని అన్నారు. ఎటువంటి అంగవైకల్యం లేని ఆ వ్యక్తి సైకిల్ తొక్కుకుంటూ వ్యాపారాలు చేసుకుంటున్నాడని ఫొటోలను ఆయన విలేకరులకు అందించారు.

వేరుశనగ విత్తనాలకు విత్తనశుద్ధి

వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి

కోటబొమ్మాళి: రబీలో రైతులు సాగుచేయబోయే వేరుశనగ విత్తనాలను ట్రైకోడెర్మాతో విత్తన శుద్ధి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. మండలంలోని తర్లిపేట సచివాలయ పరిధిలో ఎఒ ఎస్.గోవిందరావు ఆధ్వర్యాన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీ వేరుశనగ విత్తనాలకు 5-8 కేజీల ట్రైకోడెర్మాతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దీనివల్ల వేరుశనగ సాగుకు కాలర్‌రాట్ వ్యాధి సోకి మొక్కలు చనిపోకుండ ఉంటాయన్నారు. ఎకరాకు 60 కేజీల విత్తనాలను వేసుకోవాలని, చదరపు మీటరుకు 33 మొక్కలు ఉండేటట్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి వ్యవసాయ సంహాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు, విఎఎ డి.అప్పన్న పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జెడి త్రినాథస్వామి

పలువురు ఆర్థికసాయం


వజ్రపుకొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి- పలాస

జిల్లా కేంద్రంలో ఎఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన పలాస మండలం దానగొరకు చెందిన ఎన్.జోక్యో ఈ నెల 2న విధి నిర్వహణలో మృతి చెందారు. ఎస్‌పి ఆదేశాల మేరకు పోలీస్ డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కును మంగళవారం మృతుడి భార్య మేరికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోషియేషన్ అధ్యక్షులు ఆర్.కృష్ణంనాయుడు, ట్రెజరర్, కె.భుజంగరావు, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకత్తూరు : మండలంలోని దిబ్బువానిపేటకు చెందిన గండుపల్లి జగదీష్ ఇటీవల విశాఖపట్నంలో మృతి చెందారు. మృతుడి కుటుంబానికి మంగళవారం సీ ఫేరర్స్ సేవా సమితి రూ.52 వేలు ఆర్థికసాయం అందజేశారు. జగదీష్ విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో బోట్లో పనిచేస్తుండగా కాలుజారి సముద్రంలో పడిపోవడంతో మృతి చెందాడు. దీంతో భార్య లక్ష్మి, ఇద్దరు చిన్నారులు ఆధారం కోల్పోయారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన సేవా సీ ఫేరర్స్ సేవా సమితి యువకులు, కొంత మంది దాతల సహాయంతో సేకరించిన రూ.52 వేలును మృతుని పిల్లల పేరున ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు.

మెడికవర్ ఫ్యామిలీ కార్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ ప్రథమ హక్కు అని, అందువల్ల కుటుంబ కార్డు వంటి సౌకర్యాలను పొందగలిగిన వారికి నాణ్యమైన ఆరోగ్య సేవలను సామాన్యులకు మరింత చేరువ కాగలవని నగర పాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరంలోని మెడికవర్ యాజమాన్యం రూపొందించిన ఫ్యామిలీ కార్డును మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఒకే కార్డుతో అనేక రకాలైన వైద్య సేవలు పొందడానికి వీలుగా కార్డును రూపొందించారని అన్నారు. మెడికవర్ హెడ్ డాక్టర్ సాగరిక మాట్లాడుతూ విశ్వసనీయ ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. ఓపి కన్సల్టేషన్‌లపై 30 శాతం తగ్గింపు, ఒపిడి పరీక్షలపై 15 శాతం, ఐపి, డే-కేర్ సేవలపై 10 శాతం తగ్గింపు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. మెడికవర్‌లో ఖర్చు చేసే ప్రతి రూ.వెయ్యికి ఒక్కో పాయింట్ చొప్పున రీడీమ్ చేసుకోగలిగే ఫ్యామిలీ రివార్డ్‌లను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, మెడికవర్ ఆపరేషన్స్ హెడ్ శివ, హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ దిలీప్ పాల్గొన్నారు.



కార్డును ఆవిష్కరిస్తున్న కమిషనర్ ప్రసాదరావు



మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరావు

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని, ఎక్కడి చెత్త అక్కడే పారబోయకుండా తడి, పొడి చెత్తగా వేరు చేసి కంపోస్టు ఎరువుగా తయారు చేసుకోవాలని కమిషనర్ వివిఎస్ఎస్‌డి ప్రసాదరావు పేర్కొన్నారు. నగర శివారు పంచాయతీ కాజీపేట గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. చెత్త నిల్వలు రోడ్లపై గాని, కాలువల్లో గాని పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. జనావాసాల్లో వ్యర్థాలు ఎక్కడికక్కడ పాబోయకుండా చూడాలన్నారు.



విద్యార్థినులకు బహుమతిని అందజేస్తున్న ఉపాధ్యాయులు

కవిటి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- కవిటి

పాఠశాలల విద్యాశాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలా రంగ్ జానపద నృత్య పోటీలు, కళా ఉత్సవ పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి జానపద నృత్యం, జానపద గీతం విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు పి.బి.కె.శర్మ, యు.గిరిబాబు, ఎన్.ఏకాంబరేశ్వరిశర్మలను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, డిఇఒ ఎస్.తిరుమల చైతన్య, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ టి.మోహనరావు, ఉషోదయ యువజన సంఘం సభ్యులు పాండవ చంద్రశేఖర్, బెందాళం రమేష్, ఆరింగి మధు, ఆరింగి రాజు శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న గోపీ బిసాయి

హెల్పింగ్ హేండ్స్‌కు సేవా భూషణ్ అవార్డు

కవిటి: కవిటి కేంద్రంగా పనిచేస్తున్న అన్నవరం హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థకు సేవా భూషణ్ అవార్డు లభించింది. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాకినాడకు చెందిన హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. హెల్పింగ్ హేండ్స్ సంస్థ అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సంస్థ సభ్యులు విరివిగా రక్తదానం చేస్తున్నందున ఈ అవార్డు అందించినట్టు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డపాటి దాసు తెలిపారు. ఈ సందర్భంగా అన్నవరం హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకుడు గోపి బిసాయి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సామాజిక సేవే లక్ష్యంగా పనిచేస్తున్న తమ సంస్థ రక్తదానంలో కూడా ముందున్నట్టు తెలిపారు. ముఖ్యంగా తమ కార్యక్రమాలకి సహకరిస్తున్న దాతలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గణిత దినోత్సవం

ఇచ్ఛాపురం : స్టానిక పంజా వీధి, తోటూరు ఎంపియుపి స్కూల్ సంయుక్తంగా మంగళవారం జాతీయ గణిత దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలో దాదాపు 50 స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు పలు రకాల గణిత రంగవల్లి, యుపి ప్రైమరీ పాఠశాల విద్యార్థుల మ్యాథ్స్ ప్రాజెక్టులతో అధ్యాంతం అలరించారు. అనంతరం ఎంఇఒ అప్పారావును సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎన్.విశ్వనాథం, నరేంద్రనాథ్ పట్నాయక్, డి.ధనలక్ష్మి, ఎం.మల్లేశ్వరరావు, గణిత ఉపాధ్యాయులు తేజేశ్వర్‌కుమార్ పాల్గొన్నారు.



ఎంఇఒను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వ్యక్తి స్వేచ్ఛను గౌరవించాలి



మాట్లాడుతున్న సన్యాసినాయుడు, పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

సమాజంలో ప్రతిఒక్కరూ మనిషి స్వేచ్ఛను గౌరవించాలని జిల్లా న్యాయశాఖ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని నైర ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ, న్యాయవిజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతకడం ప్రతి మనిషీ జన్మ హక్కు అని తెలిపారు. హక్కులకు భంగం కలిగితే మనకు దగ్గరలో 1వ అదనపు జిల్లా కోర్టును ఆశ్రయించాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవధికార సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్, అడ్వకేట్ డి.చిన్నంనాయుడు, వి.శ్రీనివాస్, డి.అనిల్‌కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించేందుకు కోర్టులతో పాటు మానవహక్కుల కమిషన్ ఏర్పడిందని హ్యూమన్ రైట్స్ జాతీయ కౌన్సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దక్కత కృష్ణమూర్తిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవహక్కుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోబిన్ కుమార్ పాడి పాల్గొన్నారు. అలాగే బాలురు, బాలికల ప్రభుత్వ జూనియర్, స్వర్ణభారతి, ఆదిత్య డిగ్రీ కళాశాల జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు వి.శంకరరావు, జె.సదయ్య, హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫెడరేషన్ కౌన్సిల్, నియోజవర్గ సెక్రటరీ ఎం.రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట రామారావు, అసిస్టెంట్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ కె.సి.పూరి, అసిస్టెంట్ సెక్రటరీ డి.తులసీరావు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం : మెమొంటో అందజేస్తున్న కృష్ణమూర్తి రెడ్డి

టెక్కలి : స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, అర్థశాస్త్ర విభాగం ఆధిపతి ఎ.రామారావు, రాజనీతిశాస్త్ర విభాగం అధిపతి టి.త్రినాథ రావు, కోటేశ్వరరావు, జగన్నాథ బిసాయ్ పాల్గొన్నారు.

కొత్తూరు : ప్రతిఒక్కరినీ గౌరవించాలని స్థానిక జడ్జి కె.రాణి అన్నారు. కోర్టు ఆవరణలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బార్ అధ్యక్షులు కె.ఈశ్వరరావు, మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు, న్యాయవాదులు రఘునాథ్, రాడరాజు, సుధాకర్, పాల్గొనరావు, ధర్మారావు, ఉమామహేశ్వరరావు, ఆనందరావు, ప్రసాద్ జానకిరామ్, రమేష్, రవికిరణ్, శ్రీరామ పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరి సహకారం అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గం అభివృద్ధికి జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో పలు శాఖల ఉన్నతాధికారులు, శ్రీకాకుళం, గార మండలస్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రెండు మండలాల ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డి, విద్యాశాఖాధికారులు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రధాన అంశాలను నివేదించారు. దీని ఆధారంగా అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తానని హామీనిచ్చారు. మౌలిక వసతుల్లో ప్రధానంగా తాగునీరు, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, పంచాయతీ, భవనాలు నిర్మాణం, గ్రేడియేషన్ ఆఫ్ పంచాయతీ, సెక్రటరీల ఉద్యోగోన్నతులు తదితర అంశాలపై చర్చించారు. జిల్లాపరిషత్ నుంచి సాధారణ నిధులతో మంజూరు చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించాలని కోరారు. గతంలో మంజూరు చేసి మొదలుపెట్టిన పనులన్నింటినీ కొనసాగిస్తూ వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరిన్ని నిధులు కేటాయించాలని జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజాను కోరారు. శ్రీకూర్మం, గార, సింగుపురం, కళింగపట్నం వంటి మేజర్ పంచాయతీల్లో సైతం మౌలిక వసతుల్లేవని వాటిని సమకూర్చడానికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే కోరారు. జెడ్‌పి నిధులతో రోడ్లు వేసుకునే అవకాశాలను పరిశీలించాలన్నారు. పంచాయతీరాజ్, మండల పరిషత్ అధికారులతో చర్చించి అభివృద్ధి పనులు తగిన ప్రాధాన్యతనిస్తామని సిఇఒ చెప్పారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాసమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని రాయివీధిలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు వీలుగా తన సొంత నిదులతో మంగళవారం బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పరిధిలోని డివిజన్లలో కాలువలు, రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గత ఆరు నెలల్లో నగరంలోని 50 డివిజన్లలో చిన్న, పెద్ద తేడా లేకుండా కాలువల్లో పూడికలు తీయించామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి గిరిజా శంకర్ పాల్గొన్నారు.

కుక్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కవిటి: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో అసిస్టెంట్ కుక్, స్కావెంజర్, నైట్‌వాచ్ ఉమెన్ పోస్టులకు, రాజపురం ఆదర్శ పాఠశాలలో అసిస్టెంట్ కుక్, చోకేదార్ పోస్టులకు దరఖాస్తు చేస్తున్న మహిళా అభ్యర్థులకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మౌఖిక పరీక్షలు నిర్వహించారు. తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ ధనుంజయ రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ మౌఖిక పరీక్షలకు 31 మందికి, 23 హాజరయ్యారు. మౌఖిక పరీక్ష వివరాలను తదుపరి పరిశీలన కోసం సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయానికి పంపించనున్నట్లు ఎంఇఒ తెలిపారు.



పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

'అన్న క్యాంటీన్' పరిశీలన

పలాస : కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పరిశీలించారు. ఈ మేరకు మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూశారు. అలాగే క్యాంటీన్ నిర్వహణ, పారిశుధ్యం, ఆహార నాణ్యతలను నిశితంగా పరిశీలించారు. ఆహార నాణ్యత, రుచులను భోజనం చేసిన వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నాణ్యమైన ఆహారాన్ని సేవాభావంతో అందించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సిబ్బందిని ఆదేశించారు. లబ్ధిదారుల ఫోన్ నంబర్లను, ఆహార టోకెన్లు ఆన్‌లైన్ చేస్తున్నామని తెలిపారు.

సజావుగా నీటిసంఘాల ఎన్నికలు



పలాస : మాట్లాడుతున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

ప్రజాశక్తి- పలాస

సజావుగా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి అన్నారు. ఈ నెల 14న నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్న దృష్ట్యా ఎన్నికల అధికారులకు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు, పోలింగ్ అధికారులకు తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి సంఘాల్లో మేజర్ సంఘాలకు 12 టిసిలు, మైనర్ సంఘాల్లో ఆరు టిసిలు ఉంటారని అన్నారు. సభ్యులందరూ కలిసి ఒక్కో టిసిని గెలిపించుకోగా, టిసిలు అందరూ కలిసి నీటి సంఘాల అధ్యక్షులను ఎన్నుకుంటారని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు నీటి తీరువా పన్నులు బకాయిలు ఉన్న వారిని అనర్హులుగా ప్రకటిస్తామని అన్నారు. నీటి సంఘాల ఎన్నిల్లో ఎక్కువగా ఏకగ్రీవం జరిగేలా చూడాలన్నారు. ఏకగ్రీవం జరిగిన సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఎన్నికలు, ఫలితాలు ఒకే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ అధికారి బాజ్జి, ఎంపిడిఒ వసంత కుమార్, ఎలక్షన్ డిటి గిరి పాల్గొన్నారు.

లావేరు : నీటి సంఘాల నిర్వహణపై తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎన్ని జోగారావు శిక్షణఇచ్చారు.

మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి- ఆమదాలవలస

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. పట్టణంలోని గేటులో ఉన్న సిద్ధార్థ ఐటిఐ విద్యార్థులకు సంకల్పం పేరిట మాదకద్రవ్యాలు సైబర్ నేరాలు,. మైనర్ డ్రైవింగ్ యాక్టుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు.

గంజాయిని ఎవరైనా విక్రయించినా, సరఫరా చేసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఎకౌంట్, ఎటిఎం పిన్ కోడ్ వివరాలు ఎవరికీ ఇవ్వరాదన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని అన్నారు. మైనర్లకు వాహనాలను ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపాల్ పేడాడ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

నీటిసంఘాల ఎన్నికలపై సమీక్ష

పాతపట్నం : గత ప్రభుత్వ పాలనలో సాగునీటి వ్యవస్థ సర్వనాశనం చేశారని, వ్యవస్థలకు సరైన కేటాయింపులు లేక సాగునీటి సరఫరా సక్రమంగా లేకపోయిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోనిపాతపట్నం, కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి, ఎల్ఎన్‌పేట మండలాలకు సంబంధించి మైనర్ నీటి సంఘాలు 24, టిసిలు 426, మేజర్ సంఘాలు 5, టిసిలు 60 నీటి సంఘాల ఎన్నికలు, నోటిఫికేషన్, నిర్వహనపై మంగళవారం సమీక్షించారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

వజ్రపుకొత్తూరు: అర్హులందరికీ పక్కా ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని గృహ నిర్మాణశాఖ సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. మండల వెలుగు కార్యాలయంలో మంగళవారం స్వయం శక్తి సంఘాల గ్రామైక్య సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సొంత స్థలం కలిగి, ఇళ్లు లేని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఈ పథకానికి అవసరమైన ధ్రువ పత్రాలతో గ్రామ సచివాయాల్లో దరాఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి లబ్ధిదారునికీ రూ.2.77 లక్షల మంజూరు చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9949256501 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నిరీష, చంద్రకళ, కళ్యాణి, పాపమ్మ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఆమదాలవలస : మండలంలోని వంజంగిలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు అధ్యక్షతన రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు 500 మంది రోగులను పరీక్షించి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. జెమ్స్ పిఆర్‌ఒ జి.త్రినాథరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సన్మానిస్తున్న గణపతి

బదిలీ ఎస్ఐకి సత్కారం

సోంపేట : బారువ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన ఎల్.చంద్రశేఖర్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. కొర్ల జాగృతి అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి, జానకిరామ్ తదితరులు ఎస్ఐని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎస్ఐగా చంద్రశేఖర్ చేసిన సేవలను కొనియాడారు.

విస్తృత తనిఖీలు

కొత్తూరు : గంజాయి నిర్మూలనే లక్ష్యంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని సిఐ చింతాడ ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు డాగ్ స్క్వాడ్‌తో ఒడిశా నుంచి కొత్తూరు వైపు వచ్చే బస్సుల్లో, షాపుల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎక్కడా ఎటువంటి మాదకద్రవ్యాలు దొరకలేదని సిఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గజపతి ఉత్సవాలు ప్రారంభం

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ పట్టణం వారణాసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గజపతి ఉత్సవాలను మంగళవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు అధ్యక్షత వహించారు. కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ, కాశీనగర్ ఎన్ఎసి అధ్యక్షులు మెడిబోయిన సుధారాణి, ప్రధానోపాధ్యాయులు భాగీరథ బెహరా, కాశీనగర్ ఐఐసి సునీల్ కుమార్ బెహరాలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశీనగర్ పట్టణానికి పూర్వం వారణాసి అని పేరుండేదని, ఆ పేరుతో ఉత్సవాలు నిర్వహించడం ఆనందగా ఉందని అన్నారు. ఈ ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు.



మాట్లాడుతున్న తిరుపతిరావు